రాగుల సాగు.. లాభాలు బాగు

- గిరిరైతుల ఆసక్తి
- విత్తనాలను సమకూర్చుకుంటున్న వైనం
- నాట్లు పనుల్లో నిమగ్నం
- ఆదాయం వస్తుందంటున్న రైతులు



దుక్కి చేస్తున్న గిరిరైతులు

అరకులోయ టౌన్: ఏజెన్సీలో గిరిరైతులు పండించే సిరిధాన్యాల్లో చోడి (రాగుల) పంట ముఖ్యమైనది. గత కొన్ని వారాలుగా కురుస్తున్న వర్షాలకు చోడి నారు బాగా ఎదగడంతో మెట్టు పొలాలు సిద్ధం చేసుకొని నాట్లు వేసే పనిలో గిరిరైతులు నిమగ్నమై ఉన్నారు. గతంలో చోడి(రాగులు)కి డిమాండ్ తక్కువగా ఉండేది. ప్రస్తుత ఆధునిక యుగంలో సుగర్, బిపి, తదితర జబ్బుల అధిక శాతం మంది గురవడంతో వైద్యులు సూచనల మేరకు సిరిధాన్యాలవైపు ప్రజలంతా దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా చోడి (రాగులు)కి మంచి డిమాండ్ పెరిగింది. గతంలో కిలో రాగులకు కనీసం రూ. 10 ధర పలికేది కాదు. గత ఐదారేళ్లగా కిలో రాగులు రూ. 34కు ప్రైవేట్ వ్యాపారులు, జీసీసీ కొనుగోలు చేస్తోంది. దీంతో గిరిరైతులు రాగుల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. రైతు స్థాయిలోనే పూర్వం నుంచి విత్తనాలు సమకూర్చుకొని పంట వేస్తున్నారు. అరకులోయ వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలోని అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లో 8,558 హెక్టార్లల విస్తీర్ణంలో రాగుల పంట సాగు చేస్తున్నారు. వ్యవసాయశాఖ విత్తనాలు అందిస్తున్నప్పటికి రైతులే స్వతహాగా విత్తనోత్పత్తి చేసుకుని పంట వేసుకుంటున్నారు. ఈ ఏడాది 4 కిలోల ఇంద్రవతి, వేగవతి రకాల 1600కిట్లు పంపిణీ చేశారు. అయినప్పటికి ఆ రకాల రాగులు వేసుకునేందుకు రైతులు ఆశక్తి చూపడం లేదు. రైతులు సంప్రదాయ పద్ధతిలోనే సాగు చేయడం వలన వెన్నులు పెరిగి, ఒకే మొక్కకు ఎక్కువ కంటిలు వచ్చి, మంచి దిగుబడి వస్తుందని, ఎకరం విస్తీర్ణంలో 10 కిలోల విత్తనం సరిపోతుందని రైతులు చెబుతున్నారు.

రసాయన ఎరువులకు దూరం

సాధారణంగా గిరిరైతులు రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగానికి దూరంగా ఉంటారు. ప్రకృతి సాగును అలవరచుకున్న వీరు ఆవు పేడ, మూత్రంతో ఎరువులు తయారు చేసి నాట్లు వేసే ముందు పొలంలో చల్లుతారు. దీంతో సాగు పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తున్నాయి. ఎకరానికి సుమారు పది క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన రాగులకు మార్కెట్ డిమాండ్ ఎక్కువగా ఉంటూ మంచి ధర లభిస్తుంది.



నారు సేకరణలో గిరి మహిళలు



నాట్లు వేస్తున్న రైతులు



పవర్ ట్రిల్లర్‌తో దున్నుతున్న గిరిజన రైతు

గిట్టుబాటు ధరలు



ఈ ఏడాది చోడినారు వేసినప్పటి నుంచి వర్షాలు అనుకూలించడంతో నాట్లు పూర్తి చేశాం. నాట్లు వేసిన తరువాత కూడా వర్షాలు కురవడంతో పంట ఆశాజనకంగా ఉంటుంది. సేంద్రియ ఎరువులు వేసి నాట్లు వేయడంతో దిగుబడి పెరుగుతుంది. మార్కెట్‌లో ధర బాగుంటుంది. గతం కంటే ఐదారేళ్లగా మంచి ఆదాయం సమకూరుతోంది.

శెట్టి కొండప్ప, గిరిరైతు, బోసుబెడ, అరకులోయ

రైతులకు సూచనలు



గిరి రైతులు సాగు చేసే రాగులు పంటకు మంచి విత్తనాలు వాడుతున్నారు. ప్రభుత్వం అందించే విత్తనాలకు ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది ఇంద్రవతి, వేగవతి రకం 4కిలోల కిట్లు 1600 కిట్లు పంపిణీ చేశాం. ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడడం లేదు. కానీ సంప్రదాయ విత్తనాలను మాత్రమే మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది 8,558 హెక్టార్లలో చోడి సాగులో ఉంది. రైతులకు సాగుపై సూచనలు, సలహాలిస్తున్నాం.

మోహనరావు,
ఏడీ, వ్యవసాయశాఖ, అరకులోయ

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు



జల్లి రాజబాబు

పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరుతో పాటు ఏజెన్సీలో పలుచోట్ల 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ గిరిజనేతరులు ప్రభుత్వ భూములు, గిరిజనుల భూములు కబ్జా చేస్తూ అక్రమ కట్టడాలు చేపడుతున్నారని ఈ విషయంలో కలెక్టర్ దినేష్ కుమార్ తన వైఖరీ స్పష్టం చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ జిల్లా నాయకుడు జల్లి రాజబాబు శనివారం చెప్పారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాడేరు పట్టణంలో పి.గొందూరు మొదలుకొని చింతలవీధి వరకు పాత బస్టాండ్ మొదలుకొని నక్కలపుట్టు వరకు ప్రభుత్వ భూములు రోజు, రోజుకు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. ప్రభుత్వ భూములన్నీ 90శాతం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయాయన్నారు. ఆక్రమణలో విషయంలో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలోనే ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఇంకేమి రక్షణ ఉంటుందన్నారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తం కావాలని లేనిపక్షంలో ఆదివాసీ ప్రజలతో ఉద్యమిస్తామన్నారు. ఇప్పటి వరకు ఎన్ని ఆక్రమణలు గుర్తించారు ఎన్ని తొలగించారో కలెక్టర్ దినేష్ కుమార్ గిరిజనులకు స్పష్టం చేయాలన్నారు. ప్రభుత్వ భూములు, గిరిజనుల భూముల పరిరక్షణ కోసం సీపీఐ స్థానిక గిరిజనులతో కలిసి పోరాటాలు కొనసాగిస్తోందన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి విశేష అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని వజ్ర కవచాలంకృతులతో పాటు పూలమాలలతో అందంగా అలంకరించారు. ఆషాఢ మాసం శనివారం పురస్కరించుకొని ప్రత్యేక అలంకరణ చేసి విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువగా దర్శించారు. స్థానిక గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

క్లుప్తంగా

గంజాయితో అనర్థాలు



దశరిపుట్టు జంక్షన్ వద్ద తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ, పోలీసులు

ముంచంగిపుట్టు: గంజాయి, సారా వల్ల యువత జీవితాలు నాశనమవుతాయని, వాటికి దూరంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ జె.రామకృష్ణ అన్నారు. మండలంలోని కుమడ వెళ్లే మార్గంలో దేగలపుట్టు జంక్షన్ వద్ద శనివారం సాయంత్రం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగులు, లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల వివరాలు సేకరించి, ప్రశ్నించి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రాత్రిళ్లు పెట్రోలింగ్ సైతం చేస్తున్నామని, గంజాయి, సారా పూర్తిగా నివారణే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గంజాయి రవాణాకు పాల్పడుతూ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ పనులను అడ్డుకున్న రైతులు

మాకవరపాలెం : పంటలకు నష్టం కలిగించే క్వారీ తెరవద్దంటూ మండలంలోని జీకోడూరు గ్రామానికి చెందిన దళిత రైతులు మరోసారి ఆందోళనకు దిగారు. జీకోడూరు రెవెన్యూలోని 332 సర్వే నంబర్‌లో గతంలో నల్లరాతి క్వారీ నిర్వహించేవారు. కొంత కాలంగా నిలిపివేసిన క్వారీని ఇపుడు మళ్లీ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై 15 రోజుల క్రితం క్వారీ వద్ద ఆందోళన చేపట్టారు. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి వినతిపత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో శనివారం క్వారీని ప్రారంభించేందుకు లీజుదారులు క్వారీ వద్దకు చేరుకోవడంతో రైతులు పనులు చేయకుండా అడ్డుకున్నారు. రూరల్ సీఐ రేవతమ్మ, స్థానిక ఎస్‌ఐ దామోదర్‌నాయుడు క్వారీ వద్దకు చేరుకుని ఎలాంటి ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

వ్యవసాయ విద్యకు గిరి విద్యార్థులు దూరం



చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత

చింతపల్లి: సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఎత్తివేయడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత అన్నారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ విద్యకు ఉత్తమ వనరులున్నట్టు వంటి ఈ ప్రాంతం నుంచి అర్ధాంతరంగా కుంటిసాకులు తెలుపుతూ ఈ ఏడాది నుంచి ప్రవేశాలు నిలుపుదల చేయడం ఎంతో బాధాకరమన్నారు. ఇటీవల కాలంలోనే ఏజెన్సీలో ఈ వ్యవసాయ విద్యపట్ల మక్కువ పెంచుకుని విద్యార్థులు ఎక్కువ మంది ఈ కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నారన్నారు. ఎంతో మంది నిరుపేద కుటుంబాల విద్యార్థులు గతంలో ఎంతో దూరంలో ఉన్నటు వంటి పాలిటెక్నిక్ కళాశాలలో చదువు కోవడానికి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. అటువంటిది ఈ ప్రాంతంలోనే ఉన్న గిరిజన విద్యార్థులతో పాటు కడప, కర్నూలు, తిరుపతి వంటి సుదూర ప్రాంతాల నుంచి ఎంతో మంది విద్యార్థులకు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉత్తమ విద్యాభ్యాసాన్ని అందిస్తున్నటు వంటి సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఎత్తివేసే దిశగా చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. ఈ చర్యలను విశ్వవిద్యాలయ అధికారులు పునరాలించాలని కోరారు.

నేడు మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం తెల్లవారు నుంచి ప్రత్యేక పూజలు జరగనున్నాయని, ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ఉచితంగా తాగునీరు, ప్రసాదాలతో పాటు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేయడం జరిగిందని, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు.

వేరుశనగ సాగుపై రైతుల ఆసక్తి

కె.కోటపాడు : ఖరీఫ్ కాలంలో మెట్ట ప్రాంత గ్రామాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేసేందుకు ఆశక్తి చూపుతున్నారు. ప్రదానంగా మండలంలో గల భూములు వర్షాధారంగా ఉండడంతో పాటు వేరుశనగ పంట తక్కువ కాలవ్యవధిలో అందిరావడంతో సాగులో లాభదాయకంగా ఉంటుందని సాగు రైతులు పేర్కొంటున్నారు.
మండలంలో మెట్ట ప్రాంత గ్రామాలైన చిరికివానిపాలెం, ఆర్.వై.అగ్రహారం, ఉగ్గినవలస, ఆనందపురం, వారాడ, కొత్త అగ్రహారం, గుల్లేపల్లిలలో 200 ఎకరాల్లో వేరుశనగ పంట సాగులో ఉంది. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు కలిగించాయని సాగు రైతులు తెలుపుతున్నారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ పోడియం గోపాల్

వి.ఆర్.పురం: ఏజెన్సీలో పొగాకు రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ పోడియం గోపాల్ కోరారు. మండల కేంద్రంలో పార్టీ మండల కన్వీనర్ సత్తిబాబు అధ్యక్షతన నాయకులతో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ఏజెన్సీలో సన్న చిన్న కారు రైతులకు పొగాకు పంట లాభసాటిగా ఉంటుందన్నారు. బాండ్ పొగాకు కొనుగోలును గాడ్ ఫ్రే ఫిలిప్స్ సంస్థ కొనసాగించాలని కోరారు. నాణ్యమైన పొగాకు సాగుపై సంస్థ రైతులకు ముందస్తు సూచనలివ్వాలన్నారు. పొగాకు పంటకు గిట్టుబాటు ధరలు కల్పించి, కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని కోరారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలు, ఆర్టీఐ జిల్లా విభాగ అధ్యక్షులు బోడ్డు సత్యనారాయణ దేవస్థానం మాజీ చైర్మన్ రేవు బాలరాజు, నాయకులు వడ్డాణపు చినరాజారావు పెట్టా రాజు, గూటల ఫణీంద్ర, ఎస్సీ సెల్ నాయకులు చీమల కాంతారావు, మోడం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల వినియోగం



ముంచంగిపుట్టు వారపు సంతలో పాలిథిన్ కవర్లలో కూరగాయిలు

ముంచంగిపుట్టు: ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నా ప్రజల్లో ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు. తెల్లవారితే చాలు ఇంట్లోకి అవసరమైన ఏ సరుకులు అయినా పాలిథిన్ కవర్లతోనే ఇంటికి తీసుకువస్తున్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే వారపు సంతలో పాలిథిన్ కవర్ల వినియోగం విచ్చలవిడిగా దర్శనమిస్తుంది. వ్యాపారులు అధిక సంఖ్యల్లో ప్లాస్టిక్ కవర్లను బహిరంగంగానే వాడకం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు చేస్తున్నా ప్రయోజనం మాత్రం లేదు. వ్యాపారులు, ప్రజలల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. అధికారులు తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి విస్మరిస్తున్నారని పలువురు చెబుతున్నారు. దీంతో ప్లాస్టిక్ నిషేధం మండల కేంద్రంలో కనిపించడం లేదంటున్నారు. ఇప్పటికైనా ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఎంతైనా ఉందని పర్యావరణవేత్తలు, పలువురు స్థానికులు చెబుతున్నారు.

ఆశాజనకంగా అపరాల దిగుబడి



సేకరించిన పెసరబొట్టలు ఎండబెడుతున్న రైతు



కోత కోసి కుప్ప పెట్టిన నువ్వుపంట

రోలుగుంట : అపరాల పంటలు సేకరణ, సంరక్షణ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పెసలు, బొబ్బర్లు, మినుము తదితర అపరాల పంటలు, నువ్వు పంటను విస్తారంగా సాగు చేశారు. తుపాను ప్రభావంతో అడపాదడపా కురిసిన వర్షాలు పంటలకు కలిసొచ్చాయి. తరువాత వాతావరణం మారి ఎండలు కాయడంతో రైతులు పంటల నుంచి బొట్టలు సేకరించి ఎండలో ఎండబెట్టుకుంటున్నారు. నువ్వు చేను కూడా కోసి కుప్పలు పెట్టుకున్నారు. కుంచం పెసలు, మినుములు రూ.300 పలుకుతుందని రైతులు చెబుతున్నారు. మరో వైపు వర్షాలు కురవక వరి ఆకుమడులు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు చక్రస్నానం చేస్తున్న అర్చకులు



కలశాలతో అష్టోత్తర పూజలు

అనకాపల్లి: స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు విజయబాబు, గిరిబాబుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి వివిధ పూజలు, చక్రస్నానం, పూర్ణాహుతి హోమం, స్వామివారికి ఏకోత్తర సహస్ర((1001) కలశాలతో 108 కలశాలతో అష్టోతర పూజలు, సాయంత్రం ధ్వజావరోహణ, లక్ష తులసి, లక్ష కుంకుమార్చన వంటి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు విజయబాబు మాట్లాడుతూ 400 సంవత్సరాల చరిత్ర కలిగిన దేవాలయంలో 1870లో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ జరిగిందన్నారు. ఇది వంద సంవత్సరాల పూర్తయిన సందర్భంగా వజ్జల నరసింహాచార్యులు ఆధ్వర్యంలో 1970లో పవిత్రోత్సవాలు ప్రారంభించారన్నారు. ఏటా సప్త ఆనిహిక పవిత్రోత్సవం పాంచరాత్ర, ఆగమోక్తముగా జరుగుతుందన్నారు.

విస్తారంగా గంటి సాగు



కింతాడలో కోతదశలో ఉన్న గంటి పైరు

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో రైతులు గంటి పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. గంటిపంటలో మంచి పోషక విలువలు ఉండడంతో ఈ పంటకు మంచి డిమాండ్ ఉంది. గంటి పంటతో వివిధ ఆహర పదార్థాలను తయారు చేసి తీసుకోవడం వలన మంచి ఆరోగ్యం సమకూరనుండడంతో మార్కెట్‌లో పంటకు మంచి మద్దతు ధర లభిస్తుంది. దీంతో పంట సాగు లాభదాయకంగా ఉండడంతో మెట్ట ప్రాంత గ్రామాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. కె.సంతపాలెం. కె.కోటపాడు, కింతాడ, సూదివలస, గుల్లేపల్లి, గరుగుబిల్లి గ్రామాల్లో 60 ఎకరాల్లో గంటిపంటను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటను 20 రోజుల తరువాత కోతలు చేపట్టి నూర్పు చేయనున్నట్టు రైతుల పేర్కొంటున్నారు.

భక్తిశ్రద్ధలతో మండల దీక్షలు

కశింకోట: స్థానిక గవరపేటలో శారదా గణపతి రామాలయంలో వారం రోజులుగా మహిళలు లలితా సహస్ర నామ పారాయణ నిర్వహిస్తున్నారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజు లలితాదేవి కలశాన్ని నెలకొల్పి మండల దీక్షగా కొనసాగిస్తున్నారు. ఇది 42 రోజుల పాటు కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.

కార్మికుల పట్ల రాజకీయ వేధింపులు చేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

పాడేరు రూరల్: కార్మికుల పట్ల రాజకీయ వేధింపులు చేస్తే ఉపేక్షించేది లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్ తెలిపారు. పాడేరులో కార్మిక సంఘం నాయకులతో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశ, సీహెచ్‌డబ్ల్యూ, , మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, వెలుగు వీవోఏలు తదితరులు గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా సేవలందిస్తున్నారన్నారు. గ్రామస్థాయిలో ఉన్న చోటామోటా నాయకులు వీరిపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. వృత్తి ధర్మంగా చాలీచాలని వేతనాలతో నిరంతరం బతుకుపోరాటం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. వీరిపై కూడా ఎందుకు ఇంత కక్ష అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలు, హక్కులను పూర్తిస్థాయి అమలుచేయాలని, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల రాజకీయ నాయకులు కక్షపూరితంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. నాయకులు సుందర్‌రావు, సత్యనారాయణ, జీనబంధు, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం



మాట్లాడుతున్న పాడేరు ప్రథమ శ్రేణి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ జడ్జి రాము

పాడేరు: వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం మంచి విధానమని పాడేరు ప్రథమ శ్రేణి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ జడ్జీ, మండల లీగల్ ఆథారిటీ చైర్మన్ ఎ.రాము అన్నారు. స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు శనివారం పాడేరు కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వం అంశంపై అవగహన, ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అయన మాట్లాడుతూ మధ్యవర్తి అనే వ్యక్తి తన నిర్ణయాన్ని కక్షిదారులపై రుద్దకుండా తగాదాలన్నింటిని పరిష్కరించుకునే ఒక అనుకూల వాతావరణాన్ని కల్పించాలన్నారు. మధ్యవర్తిత్వం వలన ఖర్చు ఉండదని, సమయం వృథా కాదని, సామరస్యపూర్వక పరిష్కారం త్వరగా లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా 90 రోజుల పాటు ఈ అంశంపై ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.రమేష్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథస్వామి అండీలు పండగ



ఊరేగింపుగా వస్తున్న భక్తులు



ఆలయానికి నీటి కుండలతో వెళ్తున్న భక్తులు

మాడుగుల రూరల్ : జగన్నాథస్వామి రథయాత్ర తర్వాత స్వామివారి అండీలు పండగ కె.జె.పురం గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో పూరీలో జగన్నాథ స్వామి రథయాత్ర జరిగిన మరుసటి వారంలో వచ్చే శనివారం ఈ గ్రామంలో అండీళ్ల పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామస్తులు శనివారం ఉదయం పెద్ద పెద్ద కుండలు(అండీలు) పట్టుకుని ఊరేగింపుగా సమీపంలో గల తాచేరు నదికి వెళ్లి, అక్కడ కుండల్లో నీరు, పండ్లు నింపుకుని ఇళ్ల వద్దకు వచ్చి పరమాన్నం, భోజనాలు వండి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు పెట్టారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
బుచ్చెయ్యపేట : విజయరామరాజుపేట గ్రామంలో జగన్నాథస్వామి పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో పౌర్ణమి వెళ్లిన తరవాత వచ్చే శనివారం రోజున జగన్నాథస్వామి పండగను చేయడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామస్తులంతా నీటి కుండలతో జగన్నాథస్వామి పీఠం వద్దకు వెళ్లి ప్రసాదాలు వండి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి వసంతంను తమపైన, ఇళ్లల్లో, పశువులపై జల్లి ఎటువంటి అంటురోగాలు ప్రబలకుండా కుటుంబ సభ్యులంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని గ్రామస్తులు పూజలు చేశారు.

17న జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహాసభ

అనకాపల్లి: విజయవాడలో ఈనెల 17న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మొల్లి సన్నిబాబు తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ విజయరెసిడెన్సీ హాల్లో మహాసభ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలో బీసీలను ఓటు బ్యాంకుగానే ప్రజాప్రతినిధులు వాడుకుంటున్నారన్నారు. బీసీ వర్గీకరణ చేసి రాజ్యాధికారం వచ్చే వరకూ పోరాటాలు చేసే సమయం ఆసన్నమైందన్నారు.
మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. చట్ట సభలతోపాటు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కిల్లాడ అప్పలరాజు, బోయిన భానుమూర్తి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, జిల్లా నాయకులు రంధి గణపతి, బండారు అప్పారావు, ఊరిగిటి నాగమణి, దాలి బోయిన గోవింద్ తదితరులు పాల్గొన్నారు.